తోస్తుంది. వారి సామానుతోపాటు నా పత్రికా, పుష్పమూకూడా ప్లాట్‌ఫారమ్ మీదకు వెళ్ళిపోయినట్లు యగుపిస్తూంది. తెనుగు దంపతులు వారి సామాను కూలీ నెత్తికెక్కించి చడీచప్పుడూ కాకుండా వెళ్ళిపోతున్నారేమో అరవ దంపతులు ఎదో పరస్పరం రహస్య మాడుకుంటూ వున్నారు.

యువతి : ఏమిటి పారేశారు ?

యువకుడు : నిన్నటి దైనిక - నిన్నటి పువ్వు.

యువతి : అవి ఆయనవండీ! మనవి కావు.

.... .... .... .... ....

# ఇది కుర్చీ కాదు గోడకుర్చీ

ఈ రోజుల్లో ఏ సరుకు ఒక నిమిషం "దొరకదు. లేదు" యని అంటే, దాని లేమి చేతనే లోకం అంతా లేనట్టు. తాను లేనట్టు, కొంప మునిగినట్టు, కొట్టుమిట్టాడిపోవడం రివాజు అయిపోయింది. "పంచదారలే" దనండి—"అమ్మమ్మమ్మా పంచదార చిటికె డుంటే విదుపుదురూ పుణ్యముంటుంది," అని రూపాయికాగితం చేత పుచ్చుకు జెండాలా ఎగరేస్తువుంటాడు ఒకానొక వ్యక్తి.

"కాఫీ పొడుంకు కరువొచ్చింది యని అనవియ్యండి,—పదిమంది వెనకాతల మనిషీ గిరాఫీలా మెడెత్తి కాఫీపొడరు షాపులోకి తలదూర్చి "అదిగో! అడుతున్నారే! అబ్బ! అబ్బ! ఆలాపోనియి ఇంటిదగ్గఱ పొయిమీద నీళ్లెట్టు కూర్చున్నారు మావారు.

ఇక్కడ "మా వారు" (మగవాని భార్య ఆడది అలి అన్నమాట, డైవోర్సు బిల్లు ఇత్యాదుల్ని యనుసరించి తారు మారయ్యే పదార్థల్లో ఇదొకటి.)

మరిన్నీ ఇంటిల్లిపాదీని. చుట్టూను; తీరాడబ్బా పూత తీసిందిగదా యడుగూ బొడుగూ నోటిలో మృత్తిక మాత్ర మన్నా చేరుకోలేదు. వెంటనే పట్టుకెళ్ళకపోతే అగ్నిహోత్రమే దిగమింగేలాగున్నారు, ఇంటిల్లిపాదీని! బాబు బాబు బాబు! పౌనిప్పించండి. కాదన్నారా అరపౌను, లేదన్నారా పాతికపౌను, ఆఖరుకు చాలణాదన్నా సరే "కాఫీ" అనే పేరుతో చెలామణీ అయ్యేది మాత్రం ఇప్పించండి: నిఖార్సుది;" అంటూ బల్ల మీదరాలే పౌడరు తనవైపున కెగిరేలా నిట్టూర్పుల్ని కుంభించే డో పురుషుడు. అదేవ్యక్తి పురుషుడుగాక పుణ్యస్త్రీ అయివుంటే, పౌడరు కళ్ళనద్దుకు వేసే కాటుకక్కర్లేని పోజు కనపఱచి వుండేది.

ఇంతకూ "కాఫీ" రంగు, "కాఫీ" రంగని ఈ రోజుల్లో యనుకునేది కాటుకరంగుదే యని నా అభిప్రాయం.

రంగు చూచివద్దన్నారా—" అంగెపో పో! ఇంగవరాదు" అని ఫత్తు అరవమనిషిలా ఎమ్. ఎఫ్. జి. సి. వాలా నెట్టేస్తాడు.

అటువంటి గలభా, గలాటా, దోసందు మూర్తం చూమకో, "కలగలపుల రమణయ్య పంతులుగారు" కాఫీపౌడరు అమ్మే కొట్టులోకి ప్రవేశించాడు. అబలకంటె యబలుడు, తమ మధ్యకంటె తను తరమధ్యవాడు, ఈ కలగలపుల రమణయ్య పంతులుగారన్నాయన!

పంతులుగారిని చూడ్డంతోనే పౌడరు యజమాని— "పంతులుగారూ! ఆలాదయచేయండి ఆ కుర్చీమీద! తమరే

స్వయంగా దయచేసారే ?" అని ఎంతో మన్నించాడు. పంతులుగారుబ్బిపోయి పదిరూపాయలనోటు జేబులోంచి పైకి తీస్తూ "ఒక్క పదిరూపాయల పౌడరు ఈ వేళ ఇప్పిస్తిరా మఱి పదిరోజుల్దాకా మిమ్మల్ని యడగ! సరుకు వచ్చినట్టుందే? సరిపడా మనూరికి ?" అన్నారు.

యజమాని మఱీ పంతులుగారి వంకగాని, ఆ పది రూపాయలనోటు వంకగాని, చూడక, పాతికపౌను, పాతికపౌను, పొట్లాలుమిగతా వాళ్ళ కూహ్ పంచిపెట్టిస్తున్నాడు. డబ్బుచ్చుకునే! ఊరకేకాదు లేండి!

పంతులుగారు మిడుతూ మిడుతూ చూడదొడగేడు, ఒక అరగంటకాచి వేచికొని వుండిపోయినవాడై అక్కడనుండి చేతిలోని పదిరూపాయలనోటు బల్లమీద దేకించడం మొదలు పెట్టాడు.

"చూడండి! పంతులుగారూ! అల్లా ఆ ఖరీదు అయిన కాగితాన్ని దేకించారా డాగడుతుంది." అన్నాడు కొట్టు ఆయన.

"కాఫీడాగు ఈ రోజుల్లో డాబేకా" అన్నాడు, పంతులు నవ్వుతూ.

"నవ్వినా లాభంలేదండీ" అన్నాడు యజమాని.

"మఱి ఏడిస్తే వుంటుందా ?" యని అడిగాడు పంతులు.

యజమాని "ఇదేం మిరపకాయగుండకాదు ఏడవడానికి" అన్నాడు.

ఇలా ఇకిలిస్తూ సకిలిస్తూనే, పంతులుతో ఇష్టాగోష్ఠి నడుపుతూనే మఱోపాతికమందికి పంచి పెట్టించాడు యజమాని— ఈ పర్యాయం అరపౌను పొట్లాలే యన్నిని!

" క్రమంగా వర్ధిల్లచేస్తున్నారే పొట్లాం వలం " అన్నాడు పంతులు.

యజమాని " ఆదాకానే ఆ సరుకు." అన్నాడు.

" మఱి నా మాట ?''

" మీకూ వస్తుంది ఛాన్సు, తోపుకు ఔన్సు చొప్పున తగ్గి తగ్గి! ఎంతమందిని తోసుకు ముందుకువచ్చేశారు పంతులుగారూ! తమరు ?'' యని అడిగాడు యజమాని. మహా మహా నిష్పక్ష పాతిలా !

పంతులు రైలుస్టేషనులో బుక్కింగ్ బొత్రికాడన్నా నయం! యటునుంచి తిరిగిరండి యంటూ ఎఱ్ర టిక్కట్ కావలిస్తే ఎఱ్ర టిక్కట్ ఆకుపచ్చ టిక్కట్టు కావలిస్తే ఆకు పచ్చటిక్కట్ యంటూ యడ్డుచెప్పకుండా హెచ్చుతరగతి ఇచ్చే నేస్తారే నాకు! యని అంటూ పంతులు గుడ్లెఱ్రచేసుకు గుండె కాయలోనికుఱ్రు యంతా వెడల గ్రక్కేడు !

యజమాని వెంటనే ఐదు తులాల సరుకు పంతులుకిచ్చి, " తమరు ముందు ఇంటికివెళ్ళి ఒక కప్పుకాఫీ త్రాగి శాంతించి రండి, ఈ లోపున ఈ జనం సర్దుకుంటారు. నేనున్నూ ఒకకప్పు తాగి తయారీగా వుంటాను. తాపీగా కూర్చుని కోపానికి కోపం వెలిబుచ్చుకుందాం! వాళ్ళందర్నీ నిలబెట్టి మీకు కుర్చీ ఇచ్చాను! అన్నగోప్యం నిలబెట్టుకోలేని పంతులాంగం ఏం పంతులాంగమో! పంతులాంగం ?'' యంటూ హేళన చేసేడు.

" ఇది కుర్చీకాదు. గోడకుర్చీ '' అంటూ పంతులు ఐదు తులాల సరుకు చేత పుచ్చుకు " కాఫీ త్రాగివచ్చి వుండి వుంటే వీడిపని వీడబ్బపనీ కూడా పట్టించి వుండేవాణ్ణి ఎంతసేపైనా

అలా కుర్చీమీద కూర్చుండి! ఇంతసేపూ కూర్చున్నది కుర్చీ కాదు. గోడకుర్చీ!" అంటూ ఇంకా ఇంకా ఫారమ్ యవుతూ వున్న కూ్యవంక చూస్తూ "వీళ్ళందఱివెనక యవితే 2½ తులాలే!" యని అనుకుంటూ నిష్క్రమించేడు.

ఎవరు? కలగలపుల రమణయ్యాపంతులుగారు ఆయన ఆదాకా కూర్చున్నది కుర్చీకాదు! గోడకుర్చీ!

.... .... .... .... ....

## క్షౌరకల్యాణంలో కల్యాణం

పల్లెటూళ్ళల్లో సంటలు పచ్చగడ్డి మున్నైనవి ఎంత బాగా ఎదిగి ఏపుగావుంటే యంత మంచిదని ప్రజలు తలపోస్తూ వుంటారు. కాబట్టి యక్కడివాళ్ళకు గడ్డాలు పెరిగినా తలకట్లు పొడుగ్గావున్నా కాతరుచేయరు. తగువులేదు. కాని పట్నవాసాల్లో యందులోను చెన్నపట్నంవంటి మహానగరంలో, నున్నని తార్రోడ్లు, తేరైన పింగాణీ గోడలు వున్న రాజధానీ ముఖ్యపట్నంలో ప్రతీ మగా ప్రతీ ఆడా టిప్‌టాప్‌గా, ట్రిమ్‌గా వుండాలనే ప్రయత్నం. ఆలా వెంట్రుక లేచిందీ యంటే ఇలా క్షౌరం చేయించుకు తీరాలిసిందే వ్యక్తి అయినవాడు! మఱి ఆడవాళ్ళకు మీసాలూ గడ్డాలూ యుండవుగాక! అయినా సెలూన్సుమీద "ఫర్ జెంట్స్ అండ్ లేడీస్" అని వ్రాయబడి వుంటుంది కాబట్టి ఆడవాండ్ల దృష్టి కూడా ఎందుకో అటే ఆకర్షింపబడుతూ వుంటుంది.

ఫాషన్: మనమంతా ఫాషన్‌కు బానిసలం. ప్రేమకోసం బైరాగులం. అంటే విరాగులం యన్నమాట కాదు. ఒకళ్ళ